సాక్షి నల్లగొండ

గురువారం ၊ 12 ၊ అక్టోబర్ ၊ 2023



నకిలీ బంగారం ముఠా అరెస్ట్
నకిలీ బంగారం అమ్ముతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను సూర్యాపేట పోలీసులు అరెస్ట్ చేశారు. - 10లో



పట్టుబడుతున్న నగదు
ఎన్నికల కోడ్ అమలుతో రూ.50వేలకు మించి తీసుకెళ్తున్న నగదును పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. - 10లో



బోసిపోయిన యాదాద్రి
యాదాద్రి ఆలయ పరిసరాలు బుధవారం భక్తులు లేక బోసిపోయాయి. క్యూలైన్లు ఖాళీగా కనిపించాయి. - 12లో

న్యూస్‌రీల్

యాదాద్రి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి బదిలీ



బదిలీ అయిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

సాక్షి, యాదాద్రి : యాదాద్రి జిల్లా కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి బదిలీ అయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వినయ్ కృష్ణారెడ్డి నల్లగొండ జిల్లాకు కూడా కలెక్టర్‌గా పని చేశారు. అయితే ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం మూడు రోజులు పాటు రాష్ట్రంలో పర్యటించి సమీక్ష సమావేశాలు నిర్వహించింది. మునుగోడు ఉప ఎన్నికల్లో ధన, మద్యం ప్రవాహం, డబ్బులు పంచలేదని ఓటర్లు ధర్నాలు చేయడం, పోలింగ్ కేంద్రాలకు వెళ్లకపోవడం, కొందరు అధికారుల పనితీరుపై ఆరోపణలు రావడం వంటి విషయాలను ఎత్తి చూపింది. దీంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అధికారులపై ఫిర్యాదులు రావడాన్ని ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు స్థానభ్రంశం కలిగించింది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని కూడా బదిలీ చేసింది. వినయ్ కృష్ణారెడ్డి యాదాద్రి జిల్లా కలెక్టర్‌గా రెండు నెలలకు పైగా పని చేశారు. ఆయన స్థానంలో గురువారం సాయంత్రం 5 గంటల లోగా నూతన కలెక్టర్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

సూర్యాపేట ఎస్పీ కూడా..



ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను బదిలీ చేస్తూ బుధవారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజేంద్రప్రసాద్ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయనున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీగా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుకు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో రాజేంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టి బుధవారంతో రెండేళ్లు పూర్తయ్యింది. జిల్లాలో గంజాయి నిర్మూలనకు ఎంతో కృషి చేశారు.

ఆర్టీసీ ప్రయాణికులకు దసరా కానుక

నల్లగొండ రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి దసరా పండుగ కానుకగా ప్రైజ్ మనీ ప్రకటించినట్లు ఆర్ఎం శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా ధమాకా గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్‌లో భాగంగా అక్టోబర్ 21 నుంచి 23 వరకు, అలాగే 28నుంచి 30 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రతి ప్రయాణికుడు, ముందస్తుగా బుక్ చేసుకున్న టికెట్లపై వారి వివరాలు రాసి బస్టాండ్లలో ఏర్పాటు చేసే లక్కీ డ్రమ్స్‌లో వేయాలని కోరారు. పండుగ అనంతరం 110 మందికి రూ.11 లక్షల ప్రైజ్ మనీ అందజేస్తామని తెలిపారు.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎల్లయ్య ఎంపిక



చెనగల ఎల్లయ్య

హాలియా: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్ర కబడ్డీ జట్టుకు అనుముల మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన చెనగల ఎల్లయ్య ఎంపికయ్యారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు న్యూఢిల్లీలోని త్యాగరాజన్ స్టేడియంలో జరగనున్న ఆల్ ఇండియా జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ జట్టు నుంచి చెనగల ఎల్లయ్య పాల్గొననున్నారు. చెనగల ఎల్లయ్య ప్రస్తుతం గుర్రంపోడు మండలం చేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. బీపీఈడీ, ఎంపీఈడీ పూర్తి చేసిన ఎల్లయ్య ఒకపక్క క్రీడల్లో రాణిస్తునే మరోపక్క పీఈటీగా విద్యార్థులను క్రీడాకారులతో తీర్చిదిద్దుతున్నాడు. ఎల్లయ్య ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి మట్టపల్లిలో పవిత్రోత్సవాలు



మఠంపల్లి: శ్రీమట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 12నుంచి 15వరకు పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ పాలక వర్గం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో చెన్నైకి చెందిన శ్రీముక్కూరు లక్ష్మీనరసింహాచార్య పీఠం ఆధ్వర్యంలో పవిత్రాలను అందజేస్తారు. పవిత్రోత్సవాల్లో భాగంగా 12న అంకురారోపణ, పంచగవ్య ప్రాశన, మేదినాపూజ, 13న అగ్నిప్రతిష్ఠాపన, హోమం, పవిత్రాల శుద్ధి, సప్తదశకుంభారాధన, ఆవాహనలుంటాయి, 14న పవిత్రా రోపణం, 15న పవిత్రాల విసర్జోత్సవం అనంతరం శ్రీస్వామివారి మహాశాంతికళ్యాణం ఘనంగా నిర్వహించనున్నారు.

నిరంతర పర్యవేక్షణ ఉండాలి : ఎస్పీ



జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన అధికారులు



మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ క్రైం: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఎస్పీ అపూర్వరావు ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లాలోకి అక్రమంగా మద్యం, డబ్బు చేరవేయకుండా చూడాలన్నారు. సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ హన్మంతరావు, డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కసరత్తు కొలిక్కి!

- 15వ తేదీ తరువాత అభ్యర్థుల ప్రకటన
- అభ్యర్థులపై నాలుగు రకాలుగా అభిప్రాయ సేకరణ
- కిషన్‌రెడ్డి, సంజయ్, ఈటల, డీకే అరుణ నుంచి జాబితాలు
- ఆర్‌ఎస్‌ఎస్ నుంచి కూడా అభిప్రాయం తీసుకున్న బీజేపీ
- అసంతృప్తులకు నచ్చజెప్పే ప్రయత్నంలో అధిష్టానం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో పోటీలో ఉండే అభ్యర్థుల విషయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చింది. కొన్ని నియోజకవర్గాల్లో ఒకరి పేరునే మొదటి ప్రాధాన్యంగా తీసుకొని అధిష్టానానికి పంపించగా.. మరికొన్ని నియోజకవర్గాలో రెండవ పేరుతో కూడిన జాబితాను పంపించినట్లు తెలిసింది. ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించిన పార్టీ స్క్రీనింగ్ కమిటీ వాటి వడబోత కార్యక్రమాన్ని పూర్తి చేసింది. నియోజవకర్గాల్లో పోటీలో ఉండబోయే అభ్యర్థుల పేర్లను ఈ నెల 15వ తేదీ తరువాత ప్రకటించనుంది. అయితే, అభ్యర్థుల విషయంలో ఇప్పటికే స్పష్టతకు వచ్చిన పార్టీ.. మిగతా వారిని బుజ్జగించే పనిలో ఉంది.

నాలుగు రకాలుగా వడబోత

అభ్యర్థుల ఎంపికలో నాలుగు రకాల జాబితాలను సేకరించినట్లు తెలిసింది. ఇందులో ముఖ్యమైన నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ నుంచి ప్రతి నియోజకవర్గానికి చెందిన ఆశావహులపై అభిప్రాయాలను తీసుకున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు బీజేపీకి వెన్నెముకగా వ్యవహరించే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నుంచి కూడా నియోజకవర్గాల వారీగా పేర్లను తీసుకున్నట్లు తెలిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సంబంధించి కూడా ఇలా అభిప్రాయ సేకరణ చేసిన తరువాత వాటన్నింటని క్రోడీకరించి కొన్ని నియోజకవర్గాల్లో ఒక్కరి పేరును, మరికొన్ని నియోజకవర్గాల్లో ఇద్దరి పేర్లను, ఇంకొన్ని నియోజకవర్గాల్లో ముగ్గురి పేర్లతో కూడా జాబితాను పార్టీ అధిష్టానానికి పంపించింది.

నాలుగు చోట్ల ఒక్కరి పేరే..

నాలుగు నియోజకవర్గాల్లో పోటీ చేయబోయే అభ్యర్థుల విషయంలో నాలుగు రకాల జాబితాల్లో ఒక్కరి పేరును మొదటిదిగా పేర్కొన్నట్లు తెలిసింది. అందులోని ఆ ఒక్కరి విషయంలో ఏకాభిప్రాయం రావడంతో వారికే టికెట్‌ను పార్టీ ప్రకటించే అవకాశం ఉంది. మునుగోడు నియోజకవర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సూర్యాపేట నియోజకవర్గం నుంచి సంకినేని వెంకటేశ్వర్‌రావు, భువనగిరి నుంచి గూడురు నారాయణరెడ్డి, తుంగతుర్తి నుంచి కడియం రామచంద్రయ్య పేర్లను ఖరారు చేసినట్లు తెలిసింది. అనుకోని పరిణామాలు ఎదురైతే తప్ప వారి విషయంలో మార్పు ఉండే అవకాశం లేదు.

రంగంలోకి జిల్లా ఎన్నికల ఇన్‌చార్జీలు..

పార్టీ అధిష్టానం జిల్లా ఎన్నికల ఇన్‌చార్జీలను రంగంలోకి దింపుతోంది. టికెట్ ఎవరికి ఇచ్చినా పనిచేసేలా బుజ్జగింపులకు తెర తీసింది. అసంతృప్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి, కేంద్ర మంత్రి శోభ కరాంద్లజే జిల్లాకు చేరుకున్నారు. వివిధ నియోజకవర్గాల నేతలతో భేటీ అవుతున్నారు. యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లోనూ మూడు నాలుగు రోజుల్లో జిల్లా ఎన్నికల ఇన్‌చార్జీల సమావేశాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇద్దరి పేర్లను ప్రతిపాదించిన నియోజకవర్గాలు

ఉమ్మడి జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లో ఒక్కో సెగ్మెంట్ నుంచి ఇద్దరి పేర్లను అధిష్టానానికి పంపించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రధానంగా పోటీపడుతున్న వారిలో నల్లగొండ నుంచి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, నాగం వర్షిత్‌రెడ్డి టికెట్ ఆశిస్తుండగా.. వారిలో ఇద్దరి పేర్లను పంపించినట్లు సమాచారం. నకిరేకల్ నుంచి చేపూరి రవీందర్, నకిరేకంటి మొగిలయ్య, దేవరకొండ నుంచి కేతావత్ లాలూనాయక్, జర్పుల కల్యాణ్‌నాయక్, నాగార్జునసాగర్ నుంచి కంకణాల నివేదితారెడ్డి, ఐుసిరెడ్డి పాండురంగారెడ్డి, మన్నెం రంజిత్‌యాదవ్, మిర్యాలగూడ నుంచి సాదినేని శ్రీనివాసరావు, రేపాల పురుషోత్తంరెడ్డి, పల్నాటి వెంకట్‌రెడ్డి, ఆలేరు నుంచి పడాల శ్రీనివాస్, కాసం వెంకటేశ్వర్లు, సూదగాని హరిశంకర్‌గౌడ్, కోదాడలో నూకల పద్మావతిరెడ్డి, ఓర్సు వేలంగిరాజు, హుజూర్‌నగర్‌లో బొబ్బా భాగ్యరెడ్డి, గట్టు శ్రీకాంత్‌రెడ్డి, చల్లా శ్రీలతారెడ్డి టికెట్ కోసం పోటీపడుతున్నారు. వారిలో ఇద్దరి పేర్లతో కూడిన జాబితాను పంపించింది.

ఎన్నికల కోడ్ అమలు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని జిల్లాలో కచ్చితంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అన్నారు. బుధవారం నల్లగొండలోని కలెక్టరేట్ నుంచి రిటర్నింగ్ అధికారులు, ఎంసీసీ నోడల్ అధికారులు, ఎంపీడీలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మోడల్ కోడ్ అమలు అధికారులు తమ హెడ్ క్వార్టర్లను వదలి వెళ్లొద్దన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

మీడియా సెంటర్, కంట్రోల్‌రూం ప్రారంభం

కలెక్టరేట్‌లోని జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో బుధవారం మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్‌ను జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ ప్రారంభించారు. ఎన్నికల సమాచారం మీడియాకు చేరవేయడానికి ఈ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలుత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల జిల్లా కంట్రోల్ రూంను కలెక్టర్ ప్రారంభించారు. ఎన్నికల సంబంధించి టోల్ ఫ్రీ నంబర్ 1950, కాల్ సెంటర్ 1800 425 1442 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ కోటేశ్వరరావు,జిల్లా పౌర సంబంధాల అధికారి పి.శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్ గణపతి, కలెక్టరేట్ ఏఓ మోతీ లాల్ పాల్గొన్నారు.

అధిక లావాదేవీలపై సమాచారం ఇవ్వండి



కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

బ్యాంకుల్లో అధిక లావాదేవీలు జరిగితే సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆర్‌వి కర్ణన్ ఆదేశించారు. బ్యాంకుల నుంచి అనుమానాస్పదంగా నగదు తరలింపుపై బుధవారం కలెక్టరేట్ బ్యాంక్ కంట్రోలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ లావాదేవీలు జరిగితే ఇన్ కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్, జిల్లా యంత్రాంగానికి రోజువారీగా సమాచారం అందించాలని అన్నారు. పోటీ చేయనున్న అభ్యర్థుల బ్యాంకు అకౌంట్‌లు త్వరగా తెరిచి మానిటరింగ్ చేయాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ కర్ణన్ సమీక్షించారు. ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులు ఎన్నికల నిబంధనల మేరకు జరగాలన్నారు. అత్యవసర పనులను అవసరమైతే ఈసీ అనుమతి తీసుకొని చేయాలన్నారు. సమావేశాల్లో ఎల్‌డీఎం శ్రామిక్, బ్యాంక్ కంట్రోలర్లు, సీపీఓ బాలశౌరి, ఆర్‌అండ్‌బీ ఈఈ నరేందర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ముజీబుద్దీన్, పీఆర్ ఎస్‌ఈ తిరుపతయ్య, కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- నకిరేకల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్



మాట్లాడుతున్న హేమంత్ కేశవ్ పాటిల్

నకిరేకల్: నకిరేకల్ నియోజకవర్గంలో శాసనసభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్, నకిరేకల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్ కోరారు. నకిరేకల్‌లోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో బుధవారం అఖిల పక్ష పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అన్ని రాజకీయ పక్షాలు నిబంధనలు పాటించాలని, ఎవరూ ఉపేక్షించొద్దన్నారు. ఎన్నిక విషయంలో ఎలాంటి అనుమానాలు ఉన్నా రిటర్నింగ్ కార్యాయలంలో ఫిర్యాదుల కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం సరఫరా కాకుండా పూర్తి నిఘా పెట్టామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ప్రసాద్ నాయక్, పోలీస్, ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బీల్యానాయక్

దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కేతావత్ బీల్యానాయక్ బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ బీల్యానాయక్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తన అనుచరులతో కలిసి బీల్యానాయక్ దేవరకొండ నుంచి భారీ ర్యాలీగా హైదరాబాద్‌కు వెళ్లి బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శోభ కరాంద్లజే

- కేంద్రమంత్రి శోభ కరాంద్లజే

నల్లగొండ టూటౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శోభ కరాంద్లజే అన్నారు. బుధవారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నల్లగొండ, నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలో ప్రతిరోజూ ప్రజలకు వివరించాలన్నారు. నాయకులందరూ సమష్టిగా పనిచేసి పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే రాష్ట్రంతోపాటు మీ కాలనీలు, బస్తీలు అభివృద్ధి అవుతాయని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఏ ఒక్క అవకాశాన్ని వదలకుండా బీజేపీకి అనుకూలంగా మల్చుకొని ప్రజల్లోకి పోవాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మాదగాని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, దాయం భూపాల్‌రెడ్డి, కంకణాల నాగిరెడ్డి, గోలి ప్రభాకర్, పోతెపాక లింగస్వామి పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తుందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శోభ కరాంద్లజే అన్నారు. బుధవారం నల్లగొండలో బీజేపీ కార్యకర్తల సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వ హయాంలోనే రైతుల పరిస్థితి చాలా మెరుగ్గా ఉందని, కిసాన్ సమృద్ధి యోజన ద్వారా రూ.2.40 లక్షల కోట్లను రైతుల ఖాతాల్లో వేయడం జరిగిందని తెలిపారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2500 కిలో మీటర్ల జాతీయ రహదారులను పూర్తి చేశామని, మరో 2వేల కిలో మీటర్ల రోడ్డు పనులు నడుస్తున్నాయని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్న రాష్ట్రం తెలంగాణ అని, కేసీఆర్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు.

'సీఎం అల్పాహారం' తనిఖీ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పద్మానగర్ ఎంకేవీ ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ అమలు తీరును బుధవారం ఉదయం డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు తయారు చేసిన అల్పాహారాన్ని తిని అందులోని పదార్థాలు, వాటర్ క్వాలిటీ ప్రమాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అరుంధతి, డిప్యూటీ తహసీల్దార్ స్వామి, ఉపాధ్యాయులు ధమనేశ్వరరావు, వెంకటరమణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండలోనే ఉండి సేవచేస్తా

- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి
- నీలగిరి పట్టణంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం



వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ : 'నల్లగొండ నాకు రాజకీయ జన్మనిచ్చింది.. నేను ఇక్కడే ఉండి ప్రజలకు సేవ చేస్తా' అని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం నల్లగొండ పట్టణంలో ఆయన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఉదయం నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో వాకర్స్‌ను కలిశారు. వారితోపాటు వాకింగ్ చేసిన తర్వాత క్రీడాకారులతో అక్కడే వాలీబాల్, బాస్కెట్ బాల్, క్రికెట్ ఆడారు. అనంతరం కళాశాల ముందు ఉన్న టీ స్టాల్‌లో టీ చేసి అందరికీ టీ పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండలో ఆనాడే రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానని చెప్పారు. మహాత్మాగాంధీ యునివర్సిటీ, ఫ్లై ఓవర్, సీసీ రోడ్లు, ప్రతి గ్రామంలో సబ్‌స్టేషన్లు నిర్మించింది ప్రజలకు తెలుసన్నారు. ఇప్పుడు నల్లగొండలో రోడ్ల వెంట పట్టా భూములు తీసుకున్నా ప్రజలకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు.

ఏడ్చేవారిని నమ్మొద్దు..

జెండూబామ్ ఎప్పుడూ పనిచేయదని, తలనొప్పి వచ్చినప్పుడు.. నిజంగా బాధ ఉన్నప్పుడు మాత్రమే పనిచేస్తుందన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజల కన్నీళ్లు తుడిచేవాడే నాయకుడని, ఏడ్చి ఓట్లడుకున్నే వాళ్లను ఎప్పుడూ నమ్మొద్దని కోరారు. 'నా కొడుకు రెండేళ్లున్నప్పుడు నేను ఎమ్మెల్యేను అయ్యాను... వాడికి గంట సమయం కూడా సరిగా ఇవ్వలేదు. ఎదిగిన కొడుకును దేవుడికి నచ్చి తీసుకుపోయిండు. నా కొడుకు పేర ప్రతీక్ కళాశాలను కట్టించినా అక్కడకు పోయినప్పుడల్లా ఏడ్వాలి కానీ నాయకుడిగా దుఃఖాన్ని కడుపులోనే ఉంచుకొని ప్రజలకు ధైర్యం కల్పించేలా ఉన్నాను. నేను 25 సంవత్సరాలుగా పెద్దలను గౌరవిస్తున్నా, పేదలను ప్రేమిస్తున్న, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకుంటున్నా నని' చెప్పారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సహాయం చేస్తున్నానని పేర్కొన్నారు. కానీ, ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే పోవాలని ప్రజలే కోరుకుంటున్నారు.. ఆయన ఏడుస్తుంటే ప్రజలే నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

ఒక్క రోడ్డు వేసి అభివృద్ధి అంటున్నారు..

గాదరి మారయ్య పుణ్యాన నల్లగొండ అభివృద్ధి అయిందన్నారు. ఆయన వర్ధంతి సభకు వచ్చిన కేసీఆర్ దత్తత తీసుకున్నారు.. ఒక్కరోడ్డు వేసి అభివృద్ధి అంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ సుమన్, నాయకులు చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, కిన్నెర శ్రీను పాల్గొన్నారు.

24గంటలు కరెంట్ ఇవ్వాలని రైతుల ధర్నా



నిడమనూరు మండలం వేంపాడు వద్ద రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు

నిడమనూరు: ప్రభుత్వ చెబుతున్న విధంగా సాగుకు 24 గంటల పాటు కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పలు గ్రామాల రైతులు వేంపాడు స్టేజి వద్ద సాగర్ రోడ్డుపై బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ అధికారులు కోతలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చేస్తే పంటలు ఎండిపోయి తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాపై అధికారులు స్పందించాలని కోరారు. ధర్నా చేస్తున్నట్టు సమాచారం తెలుసుకున్న నిడమనూరు ఎస్‌ఐ వేణుగోపాల్‌రావు వెంటనే రైతుల వద్దకు వచ్చి వారితో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

ఫసల్ బీమా యోజన అమలు బాధ్యత రాష్ట్రానిదే


మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి శోభ కరాండ్లజే

- కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ సహాయ మంత్రి శోభ కరాండ్లజే

మిర్యాలగూడ టౌన్: రైతులకు ప్రయోజనం చేకూరేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫసల్ బీమా యోజనను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ సహాయ మంత్రి, నల్లగొండ జిల్లా ఎన్నికల పరిశీలకురాలు శోభ కరాండ్లజే అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్రం వందల కోట్ల రూపాయలు తెలంగాణకు అందిస్తే ఏం చేశారని బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్రం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ పేర్లు మార్చుకొని తానే అమలు చేశానని ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో కుటుంబ పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్రానికి ప్రధానమంత్రి వచ్చినా సీఎం రారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి బాణావత్ రతన్‌సింగ్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సంఘటన్ మంత్రి మధుకరన్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి ప్రదీప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు జితేందర్‌రెడ్డి, అసెంబ్లీ ప్రభారి గోపిరెడ్డి లచ్చిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తంరెడ్డి, సీతారాంరెడ్డి, కొండేటి సరితాశేఖర్, పులి విద్యాసాగర్, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, దొండపాటి వెంకట్‌రెడ్డి, సాంబమూర్తి, కొండల్, నర్సిరెడ్డి, జానకిరాంరెడ్డి తదితరులున్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

నల్లగొండ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళి తప్పక అనుసరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ ఆర్డీఓ రవి అన్నారు. బుధవారం నల్లగొండ నియోజకవర్గానికి సంబంధించిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పాటించాల్సిన నియమ నిబంధనలను ఆయన వివరించారు. నల్లగొండ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అనుసరించి సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, వివిధ పార్టీల ప్రతినిధులు సీపీఎం నాయకుడు నర్సిరెడ్డి, టీడీపీ నాయకుడు ఎల్వీ యాదవ్, బీజేపీ నాయకుడు శ్రీనివాస్రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు శంకర్, కాంగ్రెస్ నాయకుడు సైదిరెడ్డి, ఏఐ ఎంఐఎం నాయకుడు మహమ్మద్ రఫీయుద్దీన్ పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

దివ్యాంగులు, వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్

భువనగిరి : దివ్యాంగులు, వయోవృద్ధులు (80ఏళ్లు పైబడిన వారు) ఇంటి వద్దనే పోస్ట్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తోంది. వయోవృద్ధులు, సాధారణ ఎన్నికలకు ఒక రోజు ముందు వీరు పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా రహస్య పద్ధతిలో ఓటు వేయవచ్చు. వీరే కాకుండా కోవిడ్ రోగులు, ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు కూడా పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవచ్చు.

దరఖాస్తు చేసుకున్న వారికే..

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే వారిని ముందుగానే బీఎల్‌ఓలు గుర్తించి వారి ఇంటికి వెళ్లి ఫారం 12డి అందజేస్తారు. ఆ ఫారాన్ని పూరించి తిరిగి బీఎల్‌ఓలకు అందజేస్తారు. బీఎల్‌ఓలు వాటిని ఆర్‌ఓలకు పంపుతారు. అలాంటి వారి ఇంటికి ఎన్నికల సిబ్బంది మొబైల్ వ్యాన్‌లో చేరుకుంటారు. ఇందులో ఇద్దరు పోలింగ్ అధికారులు, ఒక వీడియోగ్రాఫర్, ఒక పోలీస్ సిబ్బంది ఉంటారు. ఓటర్‌కు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. అధికారులు నిర్దేశించిన పోలింగ్ కంపార్టుమెంట్‌లో ఓటరు రహస్యంగా ఓటు వేసి బ్యాలెట్ బాక్స్‌లో వేస్తాడు. ఈ ప్రక్రియను అధికారులు పూర్తిగా చిత్రీకరిస్తారు. ఈ ప్రక్రియ సాధారణ ఎన్నికలకు ఒక రోజు ముందుగానే పూర్తి చేస్తారు.



ఈ ఎన్నికలకు ఎంతో ప్రత్యేకత..

- ఈవీఎంలపై అభ్యర్థి ఫొటో
- 'నేర చరిత్ర' వెల్లడించాల్సిందే
- సోషల్ ఖాతాలపై ప్రత్యేక నిఘా
- దివ్యాంగులు, అంధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు





దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. గత ఎన్నికలకు భిన్నంగా ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి ఎన్నికల్లో ప్రత్యేకత ఏంటో తెలుసుకుందాం.

ఈవీఎంలపై అభ్యర్థి ఫొటో..

ఒక నియోజకవర్గంలో ఒకే పేరు గల ఇద్దరు వ్యక్తులు పోటీ చేసినప్పుడు ఓటర్లు గందరగోళానికి గురికాకుండా ఈసారి ఈవీఎంలపై అభ్యర్థి ఫొటో పెడుతున్నారు. ఎన్నికల సంఘం కేటాయించిన గుర్తులను కొందరు ఓటర్లు గుర్తు పట్టలేకపోవచ్చు. కానీ అభ్యర్థి సుపరిచితుడు కావడంతో వెంటనే గుర్తుపట్టే అవకాశం ఉంటుందని.. ఈవీఎంలలో అభ్యర్థి పేరు, ఫొటో, గుర్తులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

'సోషల్' ఖాతాల వివరాలు చెప్పాల్సిందే..

ఎన్నికల సమయంలో సోషల్ మీడియాపై సైతం ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ సోషల్ ఖాతాలను కచ్చితంగా వెల్లడించాలని ఈసీ స్పష్టం చేసింది. అభ్యర్థులు నామినేషన్ వివరాల్లో ఫోన్ నంబర్, ఈ మెయిల్ ఐడీ, సోషల్ మీడియా ఖాతాలు తప్పనిసరిగా వెల్లడించాలని పేర్కొంది.

మరికొన్ని ప్రత్యేకతలు..

అంధులకు బ్రెయిలీ లిపిలో ఉన్న ఓటరు గుర్తింపు కార్డులను అందించేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుంది. అదే విధంగా ఈవీఎంలపై బ్రెయిలీ చెక్కబడింది. ఎన్నికల సభలు, ప్రచార అనుమతులు పొందేందుకు ఎన్నికల సంఘం 'సువిధ' అప్లికేషన్‌ను రూపొందించింది. ఈ యాప్‌తో ఎన్నికలకు సంబంధించిన అనుమతులు సులభంగా పొందవచ్చు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో ఎన్నికల సంఘం నుంచి అనుమతులు వస్తాయి.

దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు..

దివ్యాంగులు వంద శాతం ఓటు వినియోగించుకునేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. పోలింగ్ రోజు సిబ్బంది ఇంటికే వచ్చి ఆటో, జీపు, ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రానికి తరలించనున్నారు. ఓటు వినియోగం అనంతరం వారిని అదే వాహనంలో ఇంటి దగ్గర దిగబెడతారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేకంగా ర్యాంపులు ఏర్పాటు చేశారు. ట్రైసైకిళ్లు అందుబాటులో ఉంచనున్నారు.

నేర చరిత్ర తెలపాల్సిందే..

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేర చరిత్రను తప్పకుండా తెలపాలి. క్రిమినల్ కేసులు ఉంటే కచ్చితంగా ఈసీకి ప్రత్యేక ఫార్మాట్‌లో వెల్లడించాల్సి ఉంటుంది. తమ నామినేషన్ పత్రాలతోపాటు నేర చరిత్ర వివరాలను జత చేయాల్సి ఉంటుంది. కేసుల వివరాలను నామినేషన్ పత్రం పార్ట్-3ఏలో తప్పనిసరిగా పేర్కొనాలి. కేసు ఎప్పుడు ముగిసింది. దానికి సంబంధించిన రికార్డులు, కేసు నంబర్ లాంటి వివరాలు తెలపాలి. పోలింగ్‌కు ముందే మూడు సార్లు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో నేర చరిత్ర వివరాలను ప్రకటనల రూపంలో వెల్లడించాలి. ఒకవేళ నేరచరిత్ర తెలపకపోతే నామినేషన్‌ను తిరస్కరించే అవకాశాలు ఉన్నాయి.

ఎలక్షన్ కోడ్ అమలు.. పట్టుబడుతున్న నగదు

టేకుమట్ల వద్ద రూ.3.58లక్షలు స్వాధీనం..

సూర్యాపేట రూరల్: సూర్యాపేట మండలం టేకుమట్లలోని కొత్త రోడ్డు జంక్షన్ వద్ద మూడు వాహనాల్లో తరలిస్తున్న రూ.3,58,500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట రూరల్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఈ నగదును పట్టుకున్నట్లు తెలిపారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో పట్టుబడిన నగదును ఎన్నికల పర్యవేక్షణ టీమ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.


సూర్యాపేట రూరల్: టేకుమట్ల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు


దేవరకొండ: వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ నాగభూషణరావు, పోలీసు సిబ్బంది

కోదాడరూరల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రూ.50వేలకు మించి నగదును ఆధారాలు లేకుండా తీసుకెళ్తే పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. బుధవారం కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం క్రాస్‌రోడ్‌లో పోలీసుల తనిఖీల్లో రూ.3.46లక్షల నగదు పట్టుబడింది. నాగారం మండలం ఈటుకూరు చెందిన నర్ల నరేష్‌కుమార్ చేపల వ్యాపారం నిమిత్తం కారులో ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తుండగా అతడి వద్ద రూ. 1.50లక్షల నగదు పట్టుబడింది. అదే విధంగా మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన అతావుల్లాఖాన్ గ్రానైట్ వ్యాపారం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లాలోని మార్టూరుకు వెళ్తుండగా అతని కారులో రూ. 1.96లక్షల నగదు పట్టుబడింది. పట్టుబడిన నగదుకు సంబంధించి ఇరువురి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో ఆ నగదును పోలీసులు రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

రూ.1.50 లక్షలు పట్టివేత

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం శివారులోని సబ్ మార్కెట్ యార్డు సమీపంలో పోలీసుల తనిఖీల్లో భాగంగా బుధవారం తిరుమలగిరి మండలం మర్రికుంటతండాకు చెందిన బానోతు రవికుమార్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.1.50లక్షలు తీసుకెళ్తుండగా సీజ్ చేసినట్లు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ దార శ్రీనివాస్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ అంజిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

దేవరకొండలో రూ.1.37లక్షలు..

దేవరకొండ: దేవరకొండ పట్టణంలో పోలీసుల తనిఖీల్లో భాగంగా బుధవారం నేరేడుగొమ్ము మండలం గుర్రపుతండాకు చెందిన శ్రీను బైక్‌పై రూ.1,37,950 నగదు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగభూషణరావు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ సతీష్, సిబ్బంది ఉన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో బుధవారం చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మార్కాపురం వెళ్తున్న ఓ కారులో రూ.88వేలు, మరో కారులో వెళ్తున్న వ్యక్తి వద్ద నుంచి పది తులాల బంగారాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్ఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ వెంకటకృష్ణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో రూ.1.30లక్షలు..

నేరేడుచర్ల: మండలంలోని చిల్లేపల్లి మూసీ బ్రిడ్జి వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా విజయవాడ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న ఎలిశెట్టి కోటయ్య కారులో రూ.1.30లక్షల నగదు పట్టుకున్నట్లు నేరేడుచర్ల ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు. పట్టుబడిన నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ ఎలక్షన్ అధికారులకు అందజేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నాగార్జునసాగర్‌లో..

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద మాచర్లకు చెందిన అరుణ్‌కుమార్ తన వాహనంపై పైలాన్‌కాలనీ వస్తుండగా అతడి వద్ద రూ.1,42,800 నగదు లభించాయని, వాటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపనందున సీజ్ చేసినట్లు సీఐ భీషన్న తెలిపారు.

మాడుగులపల్లిలో రూ.1.40 లక్షలు..

మాడుగులపల్లి: మాడుగులపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా మిర్యాలగూడ నుంచి నల్లగొండకు కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి నుంచి సరైన ఆధారాలు లేని రూ.1,42,500 నగదును గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. సీజ్ చేసిన నగదును నల్లగొండ ఆర్డీఓకు పంపినట్లు పేర్కొన్నారు.

త్రిపురారంలో రూ.87,600..

త్రిపురారం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట వాహనాల తనిఖీల్లో భాగంగా బుధవారం రూ.87,600 నగదును పట్టుకొని సీజ్ చేసినట్లు త్రిపురారం ఎస్ఐ వీర శేఖర్ తెలిపారు. వనపర్తి జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేటకు అశోక్ లేలాండ్ వాహనంలో ప్రయాణిస్తున్న నక్కల శివకుమార్, గోంపర్తి నాంచారయ్య నుంచి ఆ నగదును నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

మట్టపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.1.40లక్షలు సీజ్..

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి కృష్ణానది వంతెనపై అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పీసుపాడు గ్రామానికి చెందిన కె. శ్రీనివాస్ నుంచి రూ.1.40లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో పట్టుబడిన నగదును సీజ్ చేసి స్థానిక రెవెన్యూ అధికారులకు అందజేసినట్లు తెలిపారు.

మర్రిగూడలో రూ.3.15లక్షలు..

మర్రిగూడ: వాహనాల తనిఖీల్లో భాగంగా కిరాణ దుకాణాలకు గోధుమపిండి సరఫరా చేస్తున్న డీసీఎంలో మాల్‌కు చెందిన పాల కృష్ణ ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3,15,100 నగదును సీజ్ చేసినట్లు మర్రిగూడ ఎస్ఐ కె. రంగారెడ్డి తెలిపారు.

వారు డబ్బుకు సంబంధించి సరైన ఆధారాలు చూపలేదన్నారు.

చింతపల్లిలో రూ.1.34లక్షలు ..

చింతపల్లి: హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై బుధవారం చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం సమీపంలో రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి కారులో సరైన ఆధారాలు లేని రూ.1.34లక్షల నగదును గుర్తించి సీజ్ చేసి ఎన్నికల అధికారికి అప్పజెప్పినట్లు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి: తిరుమలగిరి మండల కేంద్రంలో బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎస్. కిరణ్‌కుమార్ స్కూటీలో రూ.74,500 నగదు, 5తులాల బంగారం, 15 కేజీల వెండి లభ్యమైనట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. పట్టుబడిన నగదు, బంగారం, వెండికి ఎలాంటి ఆధారాలను చూపకపోవడంతో సీజ్ చేసి ట్రెజరీ కార్యాలయానికి పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు దాటుతుండగా వృద్ధురాలిని ఢీకొట్టిన లారీ

- నుజ్జునుజ్జయిన రెండు కాళ్లు


ప్రమాదానికి కారణమైన లారీ

చౌటుప్పల్: రోడ్డు దాటుతుండగా వృద్ధురాలిని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ఘటన బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన మీసాల బుచ్చమ్మ బుధవారం సాయంత్రం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడపల్లి చౌరస్తా వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిని దాటుతోంది. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టింది. బుచ్చమ్మ కాళ్ల పైనుంచి లారీ వెళ్లడంతో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ వృద్ధురాలిని ఢీకొట్టి డివైడర్ పైకి వెళ్లింది. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు క్రేన్ సహాయంతో లారీని డివైడర్ పైనుంచి పక్కకు తప్పించడంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది.

100 కేజీల గంజాయి పట్టివేత

కోదాడ రూరల్: కోదాడ మండలంలోని రామాపురం చెక్‌పోస్టు వద్ద పోలీసులు బుధవారం 100 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు తెలుస్తోంది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి వస్తున్న ఓ కారు డ్రైవర్ పోలీసులను చూసి ఆపకుండా వేగంగా వెళ్లి ముందున్న మరో వాహనాన్ని ఢీకొట్టి పారిపోతుండడంతో పోలీసులు పట్టుకున్నారు. కారులో తనిఖీ చేయగా దాదాపు 100 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. కారుతో పాటు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నకిలీ బంగారం అమ్ముతున్న ముఠా అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: నకిలీ బంగారం అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్ విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని పర్బని జిల్లా పూర్ణ గ్రామం అంబికానగర్‌కు చెందిన ధరంచందు కన్నయ్యలాల్, గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన నారాయణ నట్వర్ ఆగస్టులో ఖమ్మం పట్టణ శివారులోని ఏదులాపురంలో నివాసం ఉండి అక్కడికి దగ్గరలో కాల్వ ఒడ్డు సమీపంలో చికెన్ షాపు నడుపుకునే మహిళతో పరిచయం పెంచుకున్నారు. తమది మహారాష్ట్ర అని, ఇక్కడ రోడ్డు తవ్వకం పనిచేస్తున్నామని, రోడ్డు తవ్వకాలలో తమకు కొన్ని పురాతన నాణేలతో పాటు 2 కిలోల బంగారు గొలుసు దొరికిందని ఆమెకు చెప్పారు. దొరికిన బంగారాన్ని తమ ఊరికి తీసుకెళ్లేందుకు చెక్‌పోస్టుల వద్ద ఇబ్బంది అవుతుంది కాబట్టి ఇక్కడే తక్కువ రేటుకు అమ్ముతున్నామని చెప్పారు. ఒక బంగారు గుండును ఆమెకు ఇచ్చి అసలు బంగారమో కాదో చెక్ చేయించుకోమని అన్నారు. ఆమె బంగారం చెక్ చేయించుకోగా నిజం బంగారమే అని తెలిసింది. దీంతో తమ దగ్గర ఇంకా రెండు కేజీల బంగారం ఉందని, మొత్తం రూ.10 లక్షలకు అమ్ముతామని చెప్పారు. ఆమె వద్ద డబ్బు లేదని, 12 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయని వారికి చెప్పింది. వారు ఆ 12 తులాల బంగారు ఆభరణాలు తీసుకొనేందుకు అంగీకరించి ఆమెను ఆగస్టు 22న ఖమ్మం నుంచి సూర్యాపేటకు రమ్మని చెప్పి అక్కడ రహస్య ప్రాంతానికి తీసుకొని వెళ్లి ఆమె వద్ద నుంచి 9 తులాల బంగారు ఆభరణాలు రూ.లక్ష డబ్బులు తీసుకొని వారి వద్ద ఉన్న నకిలీ బంగారం మూటను ఆమెకు ఇచ్చి అక్కడి నుంచి పరారయ్యారు. తర్వాత ఆమె మూట విప్పి చూడగా అందులో నకిలీ బంగారు పూసల దండలు కనిపించడంతో మోసపోయామని తెలుసుకుని సూర్యాపేట పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా సూర్యాపేట పట్టణంలో ఎస్ఐ యాకుబ్, పోలీసు సిబ్బంది బుధవారం ఉదయం పెట్రోలింగ్ చేస్తుండగా.. ఖమ్మం ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న కన్నయ్యలాల్, నారాయణ నట్వర్ పోలీసు వాహనాన్ని చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని పట్టుకుని తనిఖీ చేయగా కొన్ని పురాతన వెండి నాణేలు, నకిలీ బంగారు గొలుసు, బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నిజం ఒప్పుకున్నారు. వీరికి సహకరించిన విష్ణు పరారీలో ఉన్నాడని, నిందితుల వద్ద నుంచి 9 తులాల బంగారు ఆభరణాలు, నకిలీ బంగారం చైన్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన పట్టణ సీఐ రాజశేఖర్, సీసీఎస్ సీఐ నాగార్జున, పట్టణ ఎస్ఐలు యాకుబ్, రవీందర్, మహేంద్రనాథ్, హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణ, కరుణాకర్, సైదులు, కానిస్టేబుళ్లు ఆనంద్, మధు, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ నాగభూషణం, పట్టణ సీఐ రాజశేఖర్, పట్టణ ఎస్ఐ పాల్గొన్నారు.

దొంగకు జైలుశిక్ష, జరిమానా

కోదాడరూరల్: వైన్ షాపుల్లో చోరీకి పాల్పడిన నిందితుడికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శ్యాంసుందర్ బుధవారం తీర్పు వెలువరించారని కోదాడ పట్టణ సీఐ రాము తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని అనంతగిరి రోడ్డు సమీపంలో, ఖమ్మం క్రాస్ రోడ్‌లోని రెండు వైన్ షాపుల్లో జూన్ నెలలో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడి రూ.48వేలు దొంగిలించాడు. ఆయా వైన్ షాపుల యజమానుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఈ చోరీలకు పాల్పడింది అంబటి చక్రవర్తిగా గుర్తించి అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా బుధవారం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శ్యాంసుందర్ నిందితుడికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.200 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

చిట్యాల: తలనొప్పి భరించలేక ఇంట్లో చున్నీతో ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చిట్యాల పట్టణంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణానికి చెందిన మహబూబ్ కుమార్తె ఫరీనా(16) భువనగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతోంది. గత రెండు నెలలుగా ఫరీనా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతోంది. దీంతో ఆమె హాస్టల్ నుంచి వచ్చి రెండు నెలలుగా ఇంట్లోనే ఉంటుంది. మంగళవారం కూడా ఫరీనాకు తీవ్రమైన తలనొప్పి రావటంతో ఆమె తండ్రి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడి వైద్యులు ఆమెకు మరిన్ని వైద్య పరీక్షలు చేయించాల్సిందిగా సూచించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక వైద్య పరీక్షలు చేయించలేదు. తలనొప్పి భరించలేక బుధవారం తెల్లవారుజామున ఇంట్లోని వెనుక గదిలో ఇనుప కడ్డీకి చున్నీతో ఉరేసుకొని ఫరీనా ఆత్మహత్య చేసుకుంది. ఉదయం కుటుంబ సభ్యులు గమనించి బోరున విలపించారు. మృతురాలి తండ్రి మహబూబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీని ఢీకొట్టిన బైక్.. ఇద్దరికి గాయాలు

మోత్కూరు: బైక్‌పై వెళ్తున్న యువకులు లారీని ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని జామచెట్లబావి ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. మోత్కూరు మండలం పాడిచేడు గ్రామానికి చెందిన జిట్ట పవన్, జిట్ట మహవీర్ మంగళవారం అర్ధరాత్రి బైక్‌పై గుండాల నుంచి మోత్కూరుకు వస్తున్నారు. మార్గమధ్యలో జామచెట్లబావి ఎక్స్ రోడ్డులోని మలుపు వద్దకు రాగానే ఓ లారీ కాంట నుంచి రోడ్డు పైకి వెనక్కి వస్తుండగా బైక్‌తో ఢీకొట్టారు. యువకులు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా జిట్ట పవన్ కోమాలోకి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


చికిత్స పొందుతున్న జిట్ట పవన్

టిప్పర్ బీభత్సం.. ఒకరి మృతి

చైతన్యపురి: టిప్పర్ అదుపుతప్పి నిర్మాణం జరుగుతున్న ఇంట్లోకి దూసుకెళ్లడంతో వాచ్‌మన్ మృతిచెందాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పోలుమల్ల గ్రామానికి చెందిన పాల్వ ఏసు(50) మోహన్‌నగర్‌లో ఓ నిర్మాణం జరుగుతున్న భవనంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఏసు భవనం ముందు నిలబడి ఉండగా నాగోల్ నుంచి కొత్తపేట వైపు వెళ్తున్న టిప్పర్ అదుపు తప్పి భవనంలోకి దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఏసు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మెడికల్ షాప్‌లో నగదు చోరీ

మద్దిరాల: మండల కేంద్రంలోని ఓ మెడికల్ షాపులో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ప్రకారం.. మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన ఉబ్బని వెంకటనారాయణ మండల కేంద్రంలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇటీవల భవన నిర్మాణ పనులను చేపట్టిన వెంకటనారాయణ కాంట్రాక్టర్‌కు ఇవ్వడానికి రూ.లక్ష తీసుకొచ్చాడు. సమయానికి కాంట్రాక్టర్ రాకపోవడంతో ఎన్నికల కోడ్ కారణంగా ఆ నగదును షాపులో ఉంచి తాళం వేసి తన స్వగ్రామానికి వెళ్లాడు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు షాపు షటర్‌ను ధ్వంసం చేసి లాకర్ పగులగొట్టి రూ.లక్ష ఎత్తుకెళ్లారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మెడికల్ షాపులోని టేబుల్‌ను ధ్వంసం చేసిన దుండగులు

టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టిన కారు

- ఒకరికి గాయాలు

వలిగొండ: టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బుధవారం వలిగొండ మండలంలోని ఏదుళ్లగూడెం సమీపంలో సాయిరెడ్డిగూడెం స్టేజీ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. సాయిరెడ్డిగూడేనికి గూడూరు యాదిరెడ్డి బుధవారం టీవీఎస్ మోపెడ్‌పై వలిగొండకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. సాయిరెడ్డిగూడెం స్టేజీ వద్దకు చేరుకోగానే భువనగిరి నుంచి ఎదురుగా వచ్చిన కారు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదిరెడ్డి రెండు కాళ్లు విరిగడంతో పాటు తలకు బలమైన గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు చూసి 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని యాదిరెడ్డిని చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.